సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 22 । సెప్టెంబర్ । 2023



'సముద్ర ప్రహరీ' విన్యాసాలు

'సముద్ర ప్రహరీ' నౌక థాయ్‌లాండ్‌లోని ఖ్లాంగ్ టోయ్ పోర్ట్‌లో టేబుల్–టాప్ ఎక్సర్‌సైజ్, ప్రదర్శన నిర్వహించింది. 8లో



గురజాడకు నివాళి

విశాఖ: ఏయూ తెలుగు విభాగంలో గురువారం మహాకవి గురజాడ వెంకట అప్పారావు జయంతి నిర్వహించారు.



శ్రీలంక వర్సిటీతో చర్చలు

విశాఖ: ఏయూలో పాలి–బుద్ధిస్ట్ స్టడీస్ అంశంలో ఎంఏ కోర్సును ప్రారంభించే దిశగా శ్రీలంక వర్సిటీతో ఎంవోయూ చేసుకున్నారు.

ముత్యమంతా పసుపు.. లాభాల ఛాయ

మాడుగుల పసుపు మార్కెట్ ఈ ఏడాది లాభాలతో కళకళలాడుతోంది. సాగు పెంచిన రైతులు ఎక్కువ దిగుబడి సాధించారు. మంచి ధర కూడా పలకడంతో వ్యాపారులు ఖుషీగా ఉన్నారు. దేశీయ మార్కెట్‌లో మన మన్యం పసుపునకు మంచి డిమాండ్ ఉండడంతో మాడుగుల ప్రాసెసింగ్ కేంద్రాలు బిజీగా కనిపిస్తున్నాయి.



పసుపు ప్రాసెసింగ్ అనంతరం ఎగుమతి చేయడానికి సంచుల్లో నింపుతున్న దృశ్యం

- ఈ ఏడాది సేకరణ ధర పెరగడంతో ఏజెన్సీ రైతుల్లో ఆనందం
- గంజాయికి ప్రత్యామ్నాయంగా విరివిగా పసుపు సాగు
- అంతర్జాతీయ మార్కెట్‌లో గిరాకీతో వ్యాపారులకు లాభాలు



పసుపును గ్రేడింగ్ చేస్తున్న దృశ్యం

మాడుగుల: గత రెండేళ్లుగా నష్టాలు చవి చూసిన పసుపు రైతులు, వ్యాపారులు ఈ సంవత్సరం లాభాల బాట పట్టారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో మన్యం ముఖద్వారమైన మాడుగుల పసుపు వ్యాపారానికి ప్రధాన కేంద్రంగా ఉన్న విషయం తెలిసిందే. ఏజెన్సీ 11 మండలాల్లో పండించిన పసుపును ఇక్కడికే తీసుకువస్తారు. వ్యాపారులు కొనుగోలు చేసి ఇక్కడున్న ప్రాసెసింగ్ కేంద్రాల్లో వాటిని శుద్ధి చేసి వివిధ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీలో గంజాయి సాగును కట్టడి చేయడంతో ప్రత్యామ్నాయం వైపు చూసిన రైతులు ఈ ఏడాది పసుపు సాగు విస్తీర్ణాన్ని పెంచారు. దాంతో దిగుబడి కూడా పెరిగింది. దానికి తోడు మంచి ధర కూడా పలకడంతో పసుపు రైతులు, వ్యాపారులకు ఈసారి లాభాల పంట పండింది. ప్రస్తుతం ఏజెన్సీలో 4 వేల ఎకరాల్లో పసుపు పండిస్తున్నారు. రెండేళ్ల కిందటి వరకు ఏజెన్సీ 11 మండలాల నుంచి 80 కిలోల పసుపు బస్తాలు 70 వేల నుంచి 80 వేల వరకు మాడుగుల వచ్చేవి. గత ఏడాది లక్ష, ఈ ఏడాది లక్షా 20 వేల బస్తాల వరకు వచ్చినట్టు వ్యాపారులు తెలిపారు. పసుపుపై 5 శాతం జీఎస్టీ విధిస్తున్నారని, మినహాయింపు ఇచ్చి ప్రోత్సహించాలని వారు కోరుతున్నారు.

మాడుగుల పసుపు పరిశ్రమకు ఇతర రాష్ట్రాల్లో గుర్తింపు

దక్షిణ భారతంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని నర్సీపట్నం, పాలకొండ, రాజమండ్రి, వరంగల్, నిజామాబాద్, దుగ్గిరాలతోపాటు తమిళనాడు, కేరళ, ఒడిశాలోని బరంపురంలో పసుపు పరిశ్రమలున్నాయి. మాడుగులతోపాటు తుని, నర్సీపట్నం, సాలూరుల్లో ప్రాసెసింగ్ కేంద్రాలున్నాయి. కానీ మాడుగుల పసుపునకు మాత్రమే దేశీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. విశాఖ మన్యంలో పండించే పసుపులో ఔషధ గుణాలున్న కుర్కుమిన్‌తోపాటు చర్మ సౌందర్యానికి ఉపయోగపడే ఓలంటయిల్ ఉండడమే ఇందుకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. రసాయనిక ఎరువులు వాడకుండా పూర్తిగా ఆవు పేడ నుంచి తయారుచేసే ఎరువుతో పండించే ఆర్గానిక్ పంట కావడంతో మాడుగుల పసుపునకు మంచి మార్కెట్ ఉంది. మిగతా ప్రాంతాల్లో పండించే పసుపులో కుర్కుమిన్ 1.5 నుంచి 2 శాతం ఉంటే.. మాడుగుల పసుపులో 5 నుంచి 6 శాతం ఉండడంతోపాటు రంగు ఆరెంజ్ ఎల్లో కావడంతో మంచి క్రేజ్ ఉంది. నాణ్యమైన పసుపు కావడంతో సౌందర్యసాధనంగానే కాక వంటకాల్లో వాడేందుకు కూడా దీనిని వినియోగిస్తారు.

1400 కుటుంబాలకు జీవనోపాధి

మాడుగులలో 6 ప్రాసెసింగ్ కేంద్రాలున్నాయి. పసుపు ఈ ప్రాంతంలో 1400 కుటుంబాలకు జీవనాధారం. 200మంది చిన్నా పెద్ద వ్యాపారులు ఇక్కడకు వచ్చి కొనుగోలు చేస్తారు. సీజన్‌లో సుమారు 300 లారీల్లో సరకు పంపిస్తారు. ఇక్కడ పసుపును ఉడికించి డ్రమ్ములలో వేసి మంచి ఛాయ పసుపుగా తయారు చేసి ఆకర్షణీయమైన ప్యాకెట్‌లలో ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. ప్రతి ఏటా సుమారు రూ.500 కోట్లలో వ్యాపారం జరుగుతుంది.

మాడుగుల పసుపులో కుర్కుమిన్ అధికం



కుర్కుమిన్ అధికంగా ఉండే పసుపును తమిళనాడులో ఎక్కువగా ఇష్టపడతారు. వంటకాల్లో వినియోగిస్తారు. ఔషధాల తయారీలో వాడతారు. దీంతో మన ప్రాంత పసుపునకు అంతర్జాతీయ మార్కెట్‌లో ఎక్కువ గిరాకీ ఉంది. గతంలో కిలో పసుపు ధర రూ.70 నుంచి రూ.80 పలికేది. ప్రస్తుతం కిలోకు రూ.95 నుంచి రూ.100 వరకు వస్తోంది.

–దేవరాపల్లి శ్రీనివాసరావు, పసుపు వ్యాపారి, మాడుగుల

పసుపు కేంద్రాలే జీవనాధారం

తరతరాలుగా పసుపు ప్రాసెసింగ్ కేంద్రాలే మాకు జీవనాధారం. ఏజెన్సీలో పండించే దశ నుంచి మాడుగులలో ప్రాసెసింగ్ జరిగే వరకు మాకు పని ఉంటుంది. పసుపులో ఔషధ గుణాలు ఉండడంతో కరోనా మా దరి చేరలేదు.

–కోడూరు అప్పారావు, పసుపు కార్మికుడు, మాడుగుల

జీఎస్టీ తొలగించాలి

మాకు పసుపు పంటలే జీవనాధారం. సేకరణ ధర పెరగడంతో ఏజెన్సీలో రైతులందరూ పసుపు సాగుపై దృష్టి సారించారు. పసుపు పంటపై ఉన్న 5 శాతం జీఎస్టీ తగ్గిస్తే మాలాంటి వారికి ఎంతో మేలు జరుగుతుంది.

–కె.చైత్రసాయి, పసుపు రైతు, పెదబయలు

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ న్యాయ విభాగ జోనల్ ఇన్‌చార్జిగా మహేశ్వర్‌రెడ్డి



మహేశ్వర్ రెడ్డి, ఎ.వి.వి.సత్యనారాయణ(స్వామి)

దొండపర్తి (విశాఖ): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ న్యాయ విభాగ జోనల్ ఇన్‌చార్జితోపాటు, విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల న్యాయ విభాగ అధ్యక్షులను నియమించారు. న్యాయ విభాగ జోనల్ ఇన్‌చార్జిగా గొరుసు మహేశ్వర్ రెడ్డి, విశాఖ జిల్లా న్యాయ విభాగం అధ్యక్షుడిగా మేడిది ఆనంద్‌ప్రసాద్ నియమితులయ్యారు. అలాగే అనకాపల్లి జిల్లా న్యాయ విభాగ అధ్యక్షుడిగా అడారి వీర వెంకట సత్యనారాయణ (స్వామి), అల్లూరి సీతారామరాజు జిల్లా న్యాయ విభాగ అధ్యక్షుడిగా పి.మురళీమోహన్ నియమితులయ్యారు.

పెద్దేరు నీటిమట్టం 135.40 మీటర్లు



పెద్దేరు జలాశయం

మాడుగుల రూరల్: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మాడుగుల మండలం పెద్దేరు జలాశయ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. పూర్తి స్థాయి నీటిమట్టం 137 మీటర్లు కాగా, గురువారం నాటికి 135.40 మీటర్లకు చేరింది. జలాశయం నుంచి 70 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు జేఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

దీంట్లో రాచకట్టు ద్వారా 40, ఆర్‌ఎంసీ ద్వారా 30 చొప్పున క్యూసెక్కులు నీరు పంటలకు విడుదల చేస్తున్నామన్నారు. ఈ నెల 19న కురిసిన వర్షానికి జలాశయం పరిసరాలల్లో 48 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయిందన్నారు.

జిల్లా పరిషత్ ఉద్యోగులకు పదోన్నతులు



పదోన్నతులు పొందిన ఉద్యోగులతో జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

మహారాణిపేట (విశాఖ): జిల్లా పరిషత్‌లో పని చేస్తున్న నలుగురు జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించారు. నియామక పత్రాలను గురువారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమకు కేటాయించిన కార్యాలయాల్లో ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వర్తించాలన్నారు. పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు మాట్లాడుతూ సిబ్బందికి పదోన్నతులు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామ్మూర్తి, అధికారులు పాల్గొన్నారు.

24న న్యాయస్థానాల సముదాయం ప్రారంభం

విశాఖ లీగల్: నగరంలో నూతనంగా నిర్మించిన న్యాయస్థానాల సముదాయాన్ని ఈనెల 24న రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ప్రారంభిస్తారు. ఈ మేరకు రాష్ట్ర హైకోర్టు కార్యక్రమం ఖరారు చేసింది. 23న సాయంత్రం ప్రధాన న్యాయమూర్తి నగరానికి చేరుకుంటారు. 24న ఉదయం 10.30 గంటలకు విశాఖ జిల్లా కోర్టు ప్రాంగణంలోని నూతనంగా నిర్మించిన పది న్యాయస్థానాల సముదాయాన్ని ఆయన ప్రారంభిస్తారు. ప్రధాన న్యాయమూర్తి వెంట ఉమ్మడి విశాఖ జిల్లా పోర్టుఫోలియో జడ్జి జస్టిస్ యు.దుర్గాప్రసాద్ కూడా వస్తున్నారు.

ఆప్కాబ్ సమావేశానికి గురువులు హాజరు

అల్లిపురం: ఆప్కాబ్ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా శ్రీశైలంలో గురువారం 13 జిల్లాల డీసీసీబీ చైర్మన్ల సమావేశం జరిగింది. ఆప్కాబ్ చైర్మన్ ఝాన్సీ రాణి, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనాథ్‌రెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి విశాఖ జిల్లా కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కోలా గురువులు హాజరయ్యారు. పలు అంశాలపై చర్చించారు.

ఫ్లోరైడ్ సమస్యపై అసెంబ్లీలో ప్రస్తావన



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: ఫ్లోరైడ్ సమస్యతో నియోజకవర్గ ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అసెంబ్లీ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. గురువారం అసెంబ్లీలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో తాగునీటిలో ఫ్లోరైడ్ ఎక్కువగా ఉందని చెప్పారు. గొలుగొండ మండలం జి.కొత్తూరు, మరో 11 గ్రామాలు, నర్సీపట్నం మండలం దుగ్గాడ, అమలాపురం, మాకవరపాలెం మండలం జి.కోడూరు, నాతవరం మండలం మాధవనగరం, మరికొన్ని గ్రామాల్లో ఈ సమస్య ఉందన్నారు. ఇన్‌ఫిల్టరేషన్ బావుల ఏర్పాటుకు ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు.

భస్మాలంకరణలో స్వయంభూ విఘ్నేశ్వరుడు



చోడవరం: శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో భస్మాలంకరణలో కార్యసిద్ధి గణపతి స్వామి భక్తులకు గురువారం దర్శనమిచ్చారు. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రోజుకో అలంకరణలో స్వామి భక్తులకు దర్శనమిస్తున్నారు. నాలుగో రోజు గురువారం ఆలయ ప్రధానార్చకుడు కొడమంచిలి చలపతిరావు ఆధ్వర్యంలో వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు.

సారా తయారీపై గట్టి నిఘా

కె.కోటపాడు పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ మురళీకృష్ణ ఆకస్మిక తనిఖీ



పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

కె.కోటపాడు: సారా తయారీని అరికట్టేందుకు గ్రామాల్లో పోలీస్ సిబ్బందితో గట్టి నిఘా ఉంచాలని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఆదేశించారు. గురువారం రాత్రి ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. అక్కడ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పాత కేసుల విచారణ త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, నిందితులకు శిక్ష అమలయ్యేలా చూడాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. మహిళల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి న్యాయ చర్యలు తీసుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం కట్టడి చేయాలన్నారు. గ్రామాల్లో సారా తయారీ కేంద్రాలను గుర్తించి ధ్వంసం చేయాలన్నారు. తయారుదారులకు కఠిన శిక్షలు అమలు చేసి గ్రామస్తులకు హెచ్చరిక చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ ద్వారా వాహనదారులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని తెలిపారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం స్టేషన్ పరిసరాలు పచ్చదనంతో ఆహ్లాదకరంగా ఉండటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట కె.కోటపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తాతారావు, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.ధనుంజయ్ ఉన్నారు.

స్పందన అర్జీపై అసిస్టెంట్ కలెక్టర్ విచారణ



చీమలపాడులో విచారణ చేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజు

రావికమతం: జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో కలెక్టర్‌కు గిరిజన రైతులు అందించిన అర్జీ పరిష్కారం కోసం అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజు, నర్సీపట్నం ఆర్డీవో జయరాం గురువారం చీమలపాడులో బహిరంగ విచారణ నిర్వహించారు. మండల స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించడం వల్ల దీర్ఘకాలిక సమస్యలు తమ దృష్టికి వస్తున్నాయని, వాటిని సకాలంలోనే పరిష్కారానికి కృషి చేస్తున్నామని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి వివరించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు చీమలపాడు పంచాయతీ ములకలాపల్లికి చెందిన గిరిజన రైతులు కవల చంద్రయ్య, శెట్టి రాజులమ్మ, అనంతలక్ష్మి తమ జిరాయితీ భూములు 22ఎలో తప్పుడుగా నమోదయ్యాయని, తాము అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్నామని బుధవారం రావికమతంలోని స్పందనలో కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు. ఈ మేరకు ఆయన దీనిపై విచారణకు అసిస్టెంట్ కలెక్టర్‌ను ఆదేశించగా, తన సిబ్బంది సహా గ్రామానికి వచ్చి రికార్డులన్నీ పరిశీలించారు. నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేశ్వరరావు, ఆర్ఐ చినబ్బాయి పాల్గొన్నారు.

వైద్యాలయాల్లో సేవల పరిశీలన



ఎన్టీఆర్ వైద్యాలయంలో సేవలపై ఆరా



నర్సీపట్నం ఆస్పత్రిని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

అనకాపల్లి టౌన్/నర్సీపట్నం: ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు అందుతున్న సేవలపై కేంద్ర బృందాలు పరిశీలన జరుపుతున్నాయి. స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయాన్ని గురువారం రాత్రి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఫ్యామిలీ వెల్ఫేర్ బృందం సందర్శించింది. బృందం సభ్యుడు డాక్టర్ వై.రమణ శ్రీనివాసరావు ఆస్పత్రిలో పలు విభాగాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. నివేదికను కేంద్ర ప్రభుత్వ ఫ్యామిలీ వెల్ఫేర్‌కు అందజేస్తామని తెలిపారు. ఆయన వెంట డీసీహెచ్‌ఎస్ శ్రీనివాసరావు, వైద్యులు ఉన్నారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిని కేంద్ర వైద్య బృందం గురువారం సందర్శించింది. ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీ (నేషనల్ హెల్త్ సిస్టమ్స్ రిసోర్స్ సెంటర్) బృంద ప్రతినిధులు డాక్టరు సంతోష్‌బాబు, డాక్టరు యోగేంద్ర ఇక్కడ ఆస్పత్రిలోని కొన్ని విభాగాలను తనిఖీ చేశారు. ఈ నెల 23వ తేదీ వరకు బృంద సభ్యులు ఆస్పత్రిని పరిశీలిస్తారని సూపరింటెండెంట్ డాక్టరు నీలవేణిదేవి తెలిపారు. బృంద పరిశీలన ఆధారంగా ఆస్పత్రికి ర్యాంకింగ్ సర్టిఫికెట్ ఇస్తారన్నారు.

ఈ–పంట నమోదుతో ప్రభుత్వ ప్రయోజనాలు

జెట్టపురెడ్డితునిలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి క్షేత్రస్థాయి పరిశీలన



జెట్టపురెడ్డితునిలో ఈ–పంట నమోదును క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

కశింకోట: రైతులు తమ పంటలను తప్పనిసరిగా ఈ–పంటలో నమోదు చేయించుకోవాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. మండలంలోని జెట్టపురెడ్డితునిలో గురువారం ఆయన క్షేత్రస్థాయిలో సందర్శించి ఈ–పంట నమోదైన పొలాలను పరిశీలించారు. పండిస్తున్న పంట, సాగు వివరాల గురించి ఈ–పంట నమోదు చేసుకున్న రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ప్రతి రైతు సమీపంలోని రైతు భరోసా కేంద్రానికి వెళ్లి ఈ నెల 30వ తేదీలోగా ఈ–పంటలో నమోదు చేసుకుని, ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. లేదంటే ప్రభుత్వం నుంచి పంట నష్ట పరిహారం, రుణాలపై సున్నా వడ్డీ పథకం, పంటల బీమా తదితర ప్రయోజనాలు కోల్పోతారని స్పష్టం చేశారు.

ఈ–పంట నమోదును పారదర్శకంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి బి. మోహనరావు, వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎం. రామారావు, ఏవో ఎం. స్వప్న, తహసీల్దార్ జి. సత్యనారాయణ, ఎంపీడీవో వి.వి. రవికుమార్, వీఏఏ హేమలత, వీఆర్వో, రైతులు పాల్గొన్నారు.

సూక్ష్మసాగు రైతులకు ప్రోత్సాహం

తుమ్మపాల: జిల్లాలో మరింత సూక్ష్మసాగు (మైక్రో ఇరిగేషన్) చేపట్టేలా రైతులను ప్రోత్సహించాలని కలెక్టరు రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన సమీక్షించారు. సూక్ష్మసాగు చేయడం ద్వారా వచ్చే లాభాలను, ప్రభుత్వం కల్పించే రాయితీలను రైతులందరికీ తెలియజేయాలన్నారు. ఉద్యానవన సాగులో పామాయిల్, కూరగాయలు, ఆకుకూరలు సాగు చేసినట్లయితే తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి వస్తుందన్నారు. డీఎంఐవో జి.వి.లక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది 1,500 హెక్టార్లకు మించి సూక్ష్మ సాగు లక్ష్యంతో ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 1,618 మంది రైతులకు చెందిన 1,673.54 హెక్టార్ల భూమిని సూక్ష్మ సాగుకు రిజిస్టర్ చేసినట్లు చెప్పారు. జిల్లాలోని ఎంఐఏవోలు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



పోలిపల్లమ్మ (ఫైల్)

దేవరాపల్లి: నాగయ్యపేట పంచాయతీ శివారు కొత్త నాగయ్యపేటలో శతాధిక వృద్ధురాలు గుల్లేపల్లి పోలిపల్లమ్మ (110) గురువారం మరణించింది. ఆమెకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఎనిమిదిమంది మనుమలు, 19మంది మునిమనుమలు ఉన్నారు. ఆమె ముదిమి వయసులోనూ తన పనులను తానే చేసుకునేది. 15 రోజుల క్రితం పశువుల పాక వద్ద తుడుస్తుండగా ప్రమాదశాత్తు జారి పడిపోవడంతో కాలు విరిగిపోయింది. అప్పటి నుంచి మంచాన పడిన వృద్ధురాలు గురువారం తుది శ్వాస విడిచింది. వృద్ధాప్యంలోనూ అందరితో చలాకీ ఉండే పోలిపల్లమ్మ మృతితో కొత్త నాగయ్యపేటలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆమెను చూసేందుకు పరిసర ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

మరో వారం దంతేవాడ వరకే కిరండూల్ రైళ్లు

తాటిచెట్లపాలెం: భద్రతా కారణాల వల్ల కొత్తవలస–కిరండూల్ లైన్‌లో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో దంతేవాడ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తాయని వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నం–కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 28వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్–విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 29వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. విశాఖపట్నం–కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ ఈ నెల 28వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది.

తిరుగు ప్రయాణంలో కిరండూల్–విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ రైలు ఈ నెల 22 నుంచి 29వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

త్వరలోనే తెలుగు భాషపై ప్రత్యేక వెబ్‌సైట్

- ఉత్తరాంధ్ర సాహిత్య సదస్సును పండగలా నిర్వహిద్దాం
- ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు



విజయబాబును సత్కరిస్తున్న విశాఖ కలెక్టర్ మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం: ప్రపంచీకరణ, అభివృద్ధి చెందుతున్న తరుణంలో తెలుగు భాష గురించి ప్రపంచానికి చాటిచెప్పేందుకు త్వరలో తెలుగు భాషపై వెబ్‌సైట్‌ని ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ అధికార భాషా సంఘం, తెలుగు భాషా అభివృద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షుడు విజయబాబు అన్నారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో తెలుగు భాష అమలు తీరుపై కలెక్టరేట్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ జిల్లాలో భాషావేత్తలు, కవులు, కళాకారులు, సాహిత్యవేత్తలు, తెలుగు భాష అభివృద్ధికి కృషి చేసినవారందరినీ సత్కరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగుల్లోనూ ఎంతో మంది కవులు, సాహితీవేత్తలున్నారనీ వారిని కూడా గౌరవించాల్సిన ఆవశ్యకత ఉందని సూచించారు. అదేవిధంగా త్వరలోనే ఉత్తరాంధ్ర సాహిత్య సదస్సును ఒక పండగలా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ప్రభుత్వ కార్యాలయాలలో ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే జరపాలని సూచించారు. కార్యాలయంలో ఉన్నతాధికారులు ఆంగ్లంలో పంపిన లేఖలను తెలుగులో పంపాలని కోరుతూ తిప్పి పంపించవచ్చని స్పష్టం చేశారు. కలెక్టర్ డా.మల్లికార్జున మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ బ్రోచర్లు, కరపత్రాలు తెలుగులోనే ముద్రిస్తున్నామనీ, బస్టాప్‌లో సమాచారం కూడా తెలుగులోనే ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమీక్ష అనంతరం విజయబాబుని కలెక్టర్ డా.మల్లికార్జున సత్కరించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్‌రెడ్డి కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పరిపాలన రాజధానికి మద్దతుగా ప్రత్యేక పూజలు నేడు

అనకాపల్లి టౌన్: కాబోయే పరిపాలనా రాజధాని విశాఖలో విజయదశమి రోజున సీఎం క్యాంపు కార్యాలయం ఏర్పాటు కానున్న సందర్భంగా స్థానిక చిన నాలుగు రోడ్ల కూడలిలోని గణపతి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి పలు కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మండల అధ్యక్షులు, పార్టీ శ్రేణులు హాజరు కావాలని కోరారు.

గంజాయితో ఒకరి అరెస్ట్, మరొకరు పరార్

చీడికాడ: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 12 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్‌ఐ పి.రామారావు గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు గురువారం ఉదయం మండలంలోని అప్పలరాజుపురం వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. పల్సర్ బైకుపై కోణాం నుంచి వస్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పరారయ్యేందుకు ప్రయత్నించారు. బైకు జారిపోవడంతో బైకు వెనుకనున్న ఏఎస్సార్ జిల్లా, చింతపల్లికి చెందిన కొర్రా దాసురావు కిందపడి పోలీసులకు చిక్కాడు. బైక్ రైడ్ చేస్తున్న వ్యక్తి పరారయ్యాడు. దాసురావు వద్దనున్న కాలేజీ బ్యాగులో వెతగ్గా, 12 కిలోల గంజాయి ప్యాకెట్లను గుర్తించినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి, పరారైన వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన తిరుచోళ్ల రామకృష్ణ

కశింకోట: కశింకోట వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బీజేపీకి చెందిన స్థానిక నాయకుడు తిరుచోళ్ల రామకృష్ణ తీవ్రంగా గాయపడ్డారు. గ్రామ శివారులో బంకు వద్ద పెట్రోలు పోయించుకుని స్కూటీపై రోడ్డు మలుపు దాటుతుండగా, యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వస్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన రామకృష్ణను అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో కుటుంబ సభ్యులు చేర్చారు. ఈ మేరకు సమాచారం అందుకుని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నెరవేరిన దాతల ఆశయం

ప్రజల ఆశయాలకు, ప్రభుత్వ సహకారం తోడైతే అభివృద్ధి పరుగులు తీస్తుంది. దశాబ్దాలుగా దాతలిచ్చిన స్థలం ఖాళీగా పడి ఉంది. అరకొరగా తప్ప, దాతల ఉదారతను గత ప్రభుత్వాలు వినియోగించిన దాఖలాల్లేవు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక దాతల దాతృత్వానికి గౌరవం దక్కింది. నాతవరం ప్రధాన కూడలిలో ఆర్ అండ్ బీ రోడ్డును ఆనుకుని గతంలో ఓ దాత ఇచ్చిన స్థలంలో ప్రాధాన్యతా భవన నిర్మాణం, దాతల విగ్రహాల ఏర్పాటుతో గ్రామానికి కొత్త వెలుగులు వచ్చాయి.

- రూ.కోట్ల నిధులతో ప్రభుత్వ భవనాల నిర్మాణం
- స్థల దాతల జ్ఞాపకార్థం విగ్రహాల ఏర్పాటు



పీహెచ్‌సీలో రూ.2 కోట్లతో నిర్మించిన భవనం

నాతవరం: స్థానిక మెయిన్ రోడ్ జంక్షన్లో ఆర్ అండ్ బీ రోడ్డును ఆనుకుని ఉన్న మూడెకరాల భూమిని పీహెచ్‌సీ ఏర్పాటుకు 1960లో గ్రామానికి చెందిన అంకంరెడ్డి యరకయ్య దానం చేశారు. ఇదే ప్రదేశంలో ఆర్ అండ్ బీ రోడ్డునానుకుని ఉన్న విలువైన 30 సెంట్ల స్థలాన్ని దివంగత నేత అంకరెడ్డి లత్సన్న ప్రభుత్వ భవనాల కోసం ఉచితంగా అప్పగించారు. ఈ మొత్తం స్థలంలో ఏళ్ల క్రితం పీహెచ్‌సీ నిర్మాణం తప్ప, మరో భవనాన్ని ఏర్పాటు చేయలేదు. పీహెచ్‌సీకి వచ్చే రోగులు పెరిగారు. వసతి సౌకర్యం లేక ఎండా, వానల్లో ఇబ్బందులు పడుతున్న ప్రజలు అదనపు భవనాల కోసం పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపానపోలేదు.



దాత ఇచ్చిన స్థలంలో నిర్మించిన భవనాలు

రూ.2.65 కోట్లతో భవనాలు

లత్సన్న ఇచ్చిన 30 సెంట్ల స్థలంలో గత ప్రభుత్వ మంత్రి అయ్యన్నపాత్రుడు 2018లో రూ.20 లక్షలతో కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పనుల్ని మాత్రం ప్రారంభించలేదు. దాతలు ఇచ్చిన స్థలం విలువ ప్రస్తుత మార్కెట్ ధరల్లో సెంటు రూ.15 లక్షల వరకు పలుకుతోంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక డీసీసీబీ మాజీ డైరెక్టర్, దివంగత నేత అంకంరెడ్డి జమీలు దాతలిచ్చిన స్థలాల విషయాన్ని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో పీహెచ్‌సీ ప్రాంగణంలో రోగులు, వైద్యుల వసతి సమస్య తీర్చేందుకు రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయించారు. 2019లో శంకుస్థాపన చేసి, అదనపు భవన నిర్మాణాన్ని చేపట్టి, పూర్తి చేశారు. గత ప్రభుత్వం శంకుస్థాపన చేసి వదిలేసిన స్థలంలో రూ.40 లోలతో నాతవరం సచివాలయ భవనాన్ని, మరో రూ.25 లక్షలతో రైతు భరోసా కేంద్రాన్ని నిర్మించారు. అభవనాలను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌లచే ఇటీవల ప్రారంభోత్సవం చేయించారు. దాతలిచ్చిన స్థలాలకు ప్రయోజనం కల్పించారు. ప్రభుత్వానికి స్థలాన్ని ఇంచ్చినందుకు దాతల జ్ఞాపకార్థం వారి విగ్రహాలను ఏర్పాటు చేసి, కుటుంబ సభ్యుల చేతుల మీదుగా ఈ నెల 7న ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్ ఆవిష్కరించి, ఆ కుటుంబీకుల్ని ప్రత్యేకంగా అభినందించారు.

చాలా ఆనందంగా ఉంది



ప్రభుత్వానికి భూమి ఇచ్చినందుకు మా తాతయ్య యరకయ్య, మా నాన్న లత్సన్న విగ్రహాలు ఏర్పాటు చేసి, ఆవిష్కరించినందుకు ఆనందంగా ఉంది. వృథాగా పడి ఉందనుకున్న భూమిలో రూ.కోట్ల వ్యయంతో ప్రాధాన్యతా భవనాలు నిర్మించడం, ప్రజలకు చాలా ఉపయోకరంగా ఉంటుంది. విగ్రహాల్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే గణేష్‌కు కృతజ్ఞతలు.

– అంకంరెడ్డి శ్రీను, స్థల దాతల వారసుడు

గ్రామానికి వెలుగు వచ్చింది



గ్రామం మధ్య రోడ్డుకు ఇరువైపులా కోట్లాది రూపాయలతో నిర్మించిన పీహెచ్‌సీలో అదనపు భవనం, సచివాలయం, ఆర్బీకే నూతన భవనాలతో గ్రామానికి కొత్త వెలుగు వచ్చినట్టయింది. రెండుమూడేళ్ల నుంచి గ్రామానికి దూరంగా ఉన్నవారు, ఇపుడు వస్తే ఆశ్చర్యపోతారు. అంతగా గ్రామం అభివృద్ధి చెందింది. సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– కాపారపు అప్పలనర్స, నాతవరం

వసతి సమస్య తీరింది



పీహెచ్‌సీలో వసతి సమస్య ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉంది. అధిక ఎండలు, వర్షాలతో గతంలో రోగులు, వారి సహాయకులు ఇబ్బంది పడేవారు. అదనపు భవన నిర్మాణంతో రోగులకు వసతి సదుపాయంతో పాటు, మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వైద్య సిబ్బందికి అన్ని విధాలుగా ఉపయోగకరంగా ఉంటుంది.

– ప్రసన్న, వైద్యాధికారి, పీహెచ్‌సీ, నాతవరం

108 వాహనాలు నిత్యం కండిషన్‌లో ఉండాలి

నర్సీపట్నం: నిరంతర సేవలకు ఆటంకం కలగకుండా వాహనాల కండిషన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని 108 వాహనాల డిస్ట్రిక్ మేనేజర్ త్రినాథ్ పైలట్లకు సూచించారు. నర్సీపట్నం కేంద్రంగా సేవలందిస్తున్న వాహనాలను డీఎం, బయోమెడికల్ ఇంజనీర్ లక్ష్మణ్ గురువారం పరిశీలించారు. వాహనాల్లో మెడిసిన్ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్స్‌పైర్ అయిపోయిన డ్రగ్స్‌ను ముందుగా గుర్తించి తీసివేయాలన్నారు. వాహనాల్లో నిరంతరం ఆక్సిజన్ ఉండేటట్టు చూసుకోవాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా సేవలు అందించాలని సూచించారు.

మాడుగుల : స్థానిక 108 వాహనంను ఉమ్మడి జిల్లాల డీఎం త్రినాథ్, బయోమెడికల్ ఇంజనీర్ లక్ష్మణ్, గురువారం సాయంకాలం తనిఖీలు నిర్వహించారు. కేసుల విషయంలో అలర్ట్‌గా ఉండాలని, కాల్‌సెంటరు నుండి ఫోన్ రాగానే వీలైనంత త్వరగా సంఘటన స్థలానికి చేరుకుని సేవలందించాలని సూచించారు. ట్రాన్స్‌పోర్ట్ వెంటిలేటర్, ఆక్సిజన్ సక్రమంగా ఉన్నదీ లేనిది పరిశీలించారు. అనకాపల్లి పోఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కోటవురట్ల: 108 వాహనంలో ఎప్పుడూ ఆక్సిజన్ కొరత లేకుండా చూడాలని డిస్ట్రిక్ట్ మేనేజర్ త్రినాథ్ సూచించారు. కోటవురట్లలో 108 వాహనాన్ని డీఎం త్రినాథ్, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ శామ్యూల్ తనిఖీ చేశారు. నెలలో అటెండ్ అయిన కేసుల వివరాలు పరిశీలించారు. పైలట్ నరేష్, ఈఎంటీ దేముడు ఉన్నారు.



పైలట్లతో జిల్లా మేనేజర్ త్రినాథ్, బయోమెడికల్ ఇంజనీర్ లక్ష్మణ్

రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపికైన కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన కోవెల అప్పనదొర హైస్కూల్ విద్యార్థులతో సిబ్బంది

కశింకోట : కశింకోటలోని డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యారు. రోలుగుంట జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లాల జూడో పోటీల్లో పాల్గొన్న డీపీఎన్ హైస్కూల్ విద్యార్థులు వై.కోటేశ్వరరావు, కె.లక్ష్మణరావు అండర్–14 విభాగంలోను, ఎం.అఖిల్ అండర్–17 విభాగంలో స్వర్ణ పతకాలు సాధించారు. బి.రోహిత్ రజత పతకాన్ని పొందారు. వీరిలో స్వర్ణ పతాకాలు పొందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎం.ఆర్.వి.అప్పారావు, పీడీ వేదుల ప్రభాకరరావు తెలిపారు. వీరిని హెచ్‌ఎం, పీడీలతోపాటు వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కె.సుజాత, పాఠశాల ఉపాధ్యాయ బృందం గురువారం అభినందించారు.

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాది కోవెల అప్పనదొర జిల్లా పరిషత్ హై స్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యారు. బుధవారం రోలుగుంటలో ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి జూడో క్రీడాకారుల ఎంపిక పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఐదుగురు విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అండర్–17 జట్టుకి 59 కేజీల విభాగంలో ఎ.ధనలక్ష్మి, 56 కేజీల విభాగంలో కె.మణికంత, ఎం.వరలక్ష్మిలు ఎంపికవగా, అండర్–14 జట్టుకి 40 కేజీల విభాగంలో సత్యదీక్షిత్, 25 కేజీల విభాగంలో కె.సింహాద్రి ఎంపికయ్యారు. వీరిని హెచ్‌ఎం శేషుబాబు, ఇన్‌చార్జి హెచ్‌ఎం వెంకటరావు, పీఈటీ నరసింగరావులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు గునుపూడి విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో గునుపూడి హైస్కూల్ సిబ్బంది



విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

నాతవరం: మండలంలోని గునుపూడి హైస్కూల్‌కి చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయురాలు టి.శివజ్యోతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారిని పాఠశాలలో అభినందించారు. ఈ నెల 20న బుచ్చెయ్యపేట మండలం దిబ్బిడిలో జరిగిన జిల్లా స్థాయిలో పోటీల్లో అండర్–17 విభాగంలో ఎల్.అరవింద్, ఎ.నాగలక్ష్మీదేవి, అండర్–14 విభాగంలో జి.ప్రశాంతి, ఎం.భార్గవ్ ధనుష్ విజేతలుగా నిలిచినట్లు పేర్కొన్నారు. వీరు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయుడు ఎల్.అప్పలనాయుడు తెలిపారు.

వీరిని సర్పంచ్ వేముల సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు పోలుపర్తి వెంకటరమణ, విద్యా కమిటీ చైర్మన్ రమణ, సీఆర్‌పీ పోలుపర్తి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎస్.రాయవరం: పెదగుమ్ములూరు ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని హంసగాయత్రి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం సుధాకర్ తెలిపారు. ఆమె ఎంపిక పట్ల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

జిల్లా స్థాయి పోటీలకు ఆరుగురు

రేవుపోలవరం ఉన్నత పాఠశాల నుంచి ఆరుగురు విద్యార్థులు పరుగు పందెంలో జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు పి.శ్రీనివాసరావు తెలిపారు. నియోజకవర్గ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారన్నారు. వీరిలో అండర్–17లో పిక్కి సతీష్, కొయ్య వెంకటేష్, అండర్–14లో చోడిపల్లి నాగరాజు, పేర్ల హర్షవర్ధన్ ఎంపికయ్యారని పేర్కొన్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఎస్.రాయవరం: నర్సీపట్నం రోడ్డు–రేగుపాలెం స్టేషన్ మధ్యలో రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు తుని రైల్వే ఎస్‌ఐ షేక్ అబ్దుల్‌మారూఫ్ గురువారం తెలిపారు. వివరాలు..సుమారు 44 సంవత్సరాల వయసున్న వ్యక్తి తుని నుంచి అనకాపల్లి వైపు వెళ్తున్న రైలు నుంచి జారిపడి మృతి చెందినట్టు రైల్వే పోలీసులు గుర్తించారు. తెలుపు రంగు చొక్కా, సిమెంట్ రంగు జీన్స్ ఫ్యాంటు ధరించి ఉన్నాడు. మృత దేహాన్ని తుని రైల్వే ఆస్పత్రిలో భద్రపరిచారు. వివరాల మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అభ్యుదయ పాడి రైతుల క్షేత్ర సందర్శన

పాయకరావుపేట : రాష్ట్రంలో అభ్యుదయ పాడి రైతులకు శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల్లో గల చిట్టూరి ఆగ్రో అండ్ లాక్టేటింగ్ ఫుడ్స్ డెయిరీ ఫారం క్షేత్ర సందర్శన ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ పశు సంవర్ధక శాఖ సంచాలకుడు, జాతీయ పశుగణ మిషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలోని వివిధ మండలాల నుంచి 44 మంది అభ్యుదయ పాడి రైతులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. డెయిరీలో తక్కువ ఖర్చుతో సమతుల మేత, పేడతో సేంద్రియ ఎరువు, గోబర్ గ్యాస్ తయారీ, వివిధ పశు గ్రాసాల సాగు, అధిక పాల దిగుబడి ఇచ్చే స్వదేశీ, విదేశీ గో జాతులు మొదలైన వాటిని తిలకించారు. కార్యక్రమానికి సంయుక్త సంచాలకుడు ఉమ్మడి విశాఖపట్నం జిల్లా డా.డి.రామకృష్ణ క్షేత్ర స్థాయి సిబ్బంది సహాయంతో రైతులను ఎంపిక చేశారు. అదనపు సంచాలకుడు డా. వై.సింహాచలం జెండా ఊపి కార్యక్రమం ప్రారంభించారు. ప్రాంతీయ పశు సంవర్ధక శిక్షణ కేంద్రం విశాఖపట్నం సహాయ సంచాలకుడు డా. పి.రాజగోపాల్ రైతులను సమన్వయం చేశారు.



క్షేత్ర సందర్శనకు హాజరైన అభ్యుదయ పాడి రైతులు

దాడులతో సమస్యలు మరింత జటిలం

భూ వివాదంపై తహసీల్దార్ వరహాలు, ఎస్సై నాగకార్తీక్ హెచ్చరిక

రోలుగుంట: సమస్య పరిష్కారానికి దాడులు, పంటల ధ్వంసం సరికాదని, సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలని తహసీల్దార్ కె.వరహాలు, ఎస్సై బి.నాగకార్తీక్ హితవు పలికారు. బుధవారం రోలుగుంట మండలం ఎం.కె.పట్నం రెవెన్యూ చటర్జీపురంలో అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు జెడ్పీటీసీ వారా నూకరాజు, అతని అనుచరులకు, స్థానిక భూసాగుదారులకు మధ్య ఘర్షణ తలెత్తిన విషయం విదితమే. ఈ మేరకు సాగుదారులు కేదారి రాజబాబు, నీలాపు ఎరకన్న, ఈదెల రాజేశ్వరి, నీలాపు అప్పలనాయుడు తదితరులు రోలుగుంట తహసీల్దార్ కార్యాలయంలో నర్సీపట్నం ఆర్డీవో జయరాంకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేయాలని తహసీల్దార్‌ను ఆయన ఆదేశించారు. ఈ మేరకు గ్రామానికి వెళ్లి భూవివాదంలో ధ్వంసమైన అరటి, జామతోటలను తహసీల్దార్ గురువారం పరిశీలించారు. అనంతరం సాగుదారులను విచారించారు.

భూవివాదానికి కారణమైన వారితో గ్రామ పెద్దల సమక్షంలో చర్చించుకుంటే సామరస్యంగా సమస్య పరిష్కారమవుతుందని సూచించారు. విచారణ నివేదిక నర్సీపట్నం ఆర్డీవోకు అందజేయనున్నట్లు తెలిపారు. ఎస్సై బి.నాగకార్తీక్, సిబ్బంది పాల్గొన్నారు.



చటర్జీపురం రైతులతో చర్చిస్తున్న తహసీల్దార్ వరహాలు, ఎస్సై నాగకార్తీక్

థాయ్‌లాండ్ పోర్టులో 'సముద్ర ప్రహరీ' విన్యాసాలు

సింథియా: భారతదేశ సముద్ర నైపుణ్యం, నిబద్ధతను ప్రదర్శిస్తూ.. ఇండియన్ కోస్ట్ గార్డ్ కాలుష్య–నియంత్రణ నౌక 'సముద్ర ప్రహరీ' థాయ్‌లాండ్‌లోని ఖలాంగ్ టోయ్ పోర్ట్‌లో సమగ్ర కాలుష్య ప్రతిస్పందన టేబుల్–టాప్ ఎక్సర్‌సైజ్, ప్రదర్శన నిర్వహించింది. భాగస్వామ్య సవాళ్లను, ముఖ్యంగా సముద్ర కాలుష్యాన్ని పరిష్కరించడానికి ఈ వ్యాయామం జరిగింది. ఈ కార్యక్రమంలో థాయ్‌లాండ్‌కు చెందిన మారిటైమ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కో–ఆర్డినేషన్ సెంటర్, కస్టమ్స్ డిపార్ట్‌మెంట్, మెరైన్ డిపార్ట్‌మెంట్, రాయల్ నేవీ, మత్స్యశాఖ, ఇతర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. అలాగే పునీత్ సాగర్ అభియాన్‌లో భాగంగా నౌక సిబ్బంది, నేషనల్ క్యాడెట్ కార్ప్స్ క్యాడెట్‌లు, భారత రాయబార కార్యాలయం ప్రతినిధులు పట్టాయా బీచ్‌లో అంతర్జాతీయ ఔట్రీచ్ బీచ్ క్లీన్–అప్ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారు.



బ్యాంకాక్‌లోని టోయి పోర్ట్‌లో..

గురజాడ పురస్కారాల ప్రదానం



గురజాడ పురస్కారాలను అందుకున్న కవులు, రచయితలు

సీతంపేట: తెలుగు భాష అభివృద్ధి, వికాసం, పరిరక్షణలో భాగంగా త్వరలో ఉత్తరాంధ్ర స్థాయిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు అన్నారు. తెలుగు భాష సాహితీ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం పౌర గ్రంథాలయంలో గురజాడ అప్పారావు జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గురజాడ జయంతి సందర్భంగా ఇంత మంది కవులు, రచయితలను ఓ వేదికపై సత్కరించడం గొప్ప విషయమన్నారు. సాహిత్య వికాసం కోసం ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. అనంతరం బోర భారతీ దేవి రచించిన 'భారతీ శతకం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. సేవా సంస్థ అధ్యక్షుడు కంచర్ల సుబ్బానాయుడు, ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ కూటికుప్పల సూర్యారావు, ఆచార్య బాలమోహన్ దాస్, శృంగేరి శారద, అట్టాడ అప్పలనాయుడు, వెలమల సిమ్మన్న ప్రసంగించారు. అనంతరం 25 మంది ప్రముఖ కవులకు గురజాడ పురస్కారాలతో సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవిసమ్మేళనం అలరించింది.

గురజాడకు నివాళులు

డొండపర్తి: మహాకవి గురజాడ 161వ జయంతి సందర్భంగా గురజాడ కళాక్షేత్రంలో ఆయన విగ్రహానికి వీఎంఆర్‌డీఏ కార్యదర్శి రంగయ్య పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుభాషకు వన్నె తెచ్చిన మహాపురుషుడు గురజాడ అని, సామాజిక అసమానతలపై గురజాడ చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. వీఎంఆర్‌డీఏ డీఎఫ్ఓ శాంతి స్వరూప్, ప్లానింగ్, పరిపాలన అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో ఇద్దరు అదుపులోకి

కొనసాగుతున్న పోలీసుల దర్యాప్తు

మాకవరపాలెం:యువకుడి హత్య కేసులో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని దుంగలవానిపాలెం గ్రామానికి చెందిన ధనిమిరెడ్డి రవి(35) మంగళవారం రాత్రి రామన్నపాలెం సమీపంలో హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లోనూ దర్యాప్తు ముమ్మరం చేశారు. దీనిలో భాగంగా ఈ హత్యకు పాల్పడిన ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. తొలుత వివాహేతర సంబంధంగా పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. కానీ రవి హత్యకు ఇది కారణం కానట్టుగా పోలీసులు ఇప్పటికే ఒక నిర్ధారణకు వచ్చినట్టు సమాచారం. హత్యకు దారితీసిన కారణాలపై నర్సీపట్నం రూరల్ సీఐ రమణయ్య, స్థానిక ఎస్‌ఐ రామకృష్ణారావు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ప్రింట్, టీవీ జర్నలిస్టులకు 278 అక్రిడిటేషన్లు

తుమ్మపాల: జిల్లాలో ప్రింట్, టీవీ జర్నలిస్టులు 278 మందికి మీడియా అక్రిడిటేషన్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడవ విడతగా 44 మందికి అక్రిడిటేషన్లు మంజూరు చేశామన్నారు. గతంలో రెండు విడతలుగా 234 మందికి అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీపీఆర్వో ఇంద్రావతి, డీపీఆర్వో డి.సాయిబాబా, కమిటీ సభ్యులు బీఎస్‌వీ లోవరాజు, కె.చంద్రరావు, టి.రమేష్, కె.చంద్రశేఖర్, షేక్ చాంద్‌బాషా పాల్గొన్నారు.

క్లుప్తంగా

వార్డు సమస్యలపై గళమెత్తిన కార్పొరేటర్ నీలిమ



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ నీలిమ

అనకాపల్లిటౌన్:వార్డు పరిధిలో పారిశుధ్య సమస్యపై 80వ వార్డు కొణతాల నీలిమ జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో గురువారం గళమెత్తారు. మలేరియా డిపార్ట్‌మెంట్‌లో సిబ్బంది కొరత వేధిస్తోందన్నారు. మలేరియా, డెంగ్యూ జ్వరాల బారినపడి వార్డు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మేయర్ హరివెంకట కుమారి దృష్టికి తీసుకెళ్లారు. వార్డుకి పదిమంది యాంటీ లార్వా ఆపరేటర్లు ఉండేవారని, ప్రస్తుతం రెండు వార్డులకు ఒకరే ఉన్నారని తెలిపారు. మేయర్, కమిషనర్ స్పందించి వార్డుకు ఐదుగురు చొప్పున ఆపరేటర్లను నియమిస్తామన్నారు.

24న ఎస్పీ బాలు పాటల పోటీలు

అనకాపల్లిటౌన్: గాన గంధర్వుడు, దివంగత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తృతీయ వర్ధంతి పురస్కరించుకుని పాటల పోటీలు నిర్వహించనున్నట్లు కల్యాణి అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ చైర్మన్ ఇంద్రగంటి లక్ష్మీశ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25న ఎస్పీ బాలు తృతీయ వర్ధంతి సందర్భంగా, ముందురోజైన 24న స్థానిక జార్జి క్లబ్‌లో అబ్దుల్ కలాం సేవా సంస్థ, అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి పాటల పోటీలు జరుగుతాయన్నారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించే పోటీల్లో గెలుపొందిన వారికి, ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందిస్తామన్నారు. ఆసక్తి గల వారు అకాడమీలోగానీ లేదా 99595 77789, 81215 21566 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

గణపతికి లక్ష దీపారాధన

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం ప్రకాశరావుపేటవీధిలో ఆనంద గణపతి సేవా సంఘం ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. మూడోరోజైన బుధవారం రాత్రి లక్ష దీపారాధన చేశారు. ఈ కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు దీపాలను ఏర్పాటు చేసి, గణపతిని ఆరాధించారు. సంఘ నిర్వాహకులు మాట్లాడుతూ భక్తుల సహకారంతో సంప్రదాయబద్ధంగా నవరాత్రి వేడుకల్ని నిర్వహిస్తున్నామన్నారు. అన్నసమారాధన, సాంస్కృతిక కార్యక్రమాలకు భక్తులు అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

7/జీ బృందావన కాలనీ	రాజా
మార్క్ ఆంటోని	సత్యనారాయణస్క్రీన్-1
కలివీరుడు	సత్యనారాయణస్క్రీన్-2
మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి	షిర్డిసాయి
జవాన్	పర్తిసాయి
జవాన్	వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	శ్రీసత్య
ఎక్స్‌పెండబుల్స్4	రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 325 బెల్లం దిమ్మలు వచ్చాయి..

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	--	--
రెండో రకం	4,070	4,370
మూడోరకం	3,920	4,050

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 62 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-35 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-15 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 344 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 239 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

'వరి'ంచిన ఆశలు

- తాజా వర్షాలతో ముమ్మరంగా వరినాట్లు
- సాధారణ సాగు విస్తీర్ణంపై పెరిగిన ఆశలు
- 85 శాతం విస్తీర్ణంలో పూర్తయిన నాట్లు



ఉత్సాహంగా వరి నాట్లలో రైతు కూలీలు



కనుచూపు మేర పూర్తయిన వరి నాట్లు



శారదానదిలో చేరిన వరద నీరు

గత ఏడాది కశింకోట మండలంలో సాధారణ విస్తీర్ణం కంటే 200 హెక్టార్లలో అదనంగా ఖరీఫ్ వరి సాగు జరిగింది. ఈ ఏడాది కూడా అదే స్థాయిలో సాగు విస్తీర్ణాన్ని అంచనా వేశారు. అయితే ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వర్షాల మందగమనంతో, ఎండిపోతున్న వరినాట్లతో రైతులు దిగాలుపడ్డారు. తాజాగా కురిసిన వర్షాలు, శారదానదికి ఎగువ భాగంలో కురుస్తున్న వర్షాలతో రైతుల్లో ఆనందం హెచ్చింది. ఖరీఫ్ వరి నాట్లు జోరందుకున్నాయి.

కశింకోట: మండలంలో ఖరీఫ్ వరి నాట్లు సాధారణ విస్తీర్ణానికి చేరువ అవుతున్నాయి. సరైన వర్షాల్లేక ఈ ఏడాది వరి నాట్లు ఆశించినంత వేగంగా పూర్తి కాలేదు. సాధారణ విస్తీర్ణంలోనైనా సాగు జరిగేనా? అన్న సందేహం నెలకొంది. గత నెల వరకు 60 శాతం విస్తీర్ణంలో వరి నాట్లు పడితే చాలని అధికారులు అంచనా వేశారు. అయితే గత కొద్ది రోజులుగా వర్షాలు పడుతుండటం, శారదానదిలో అదనంగా వరద నీరు చేరడంతో వరినాట్లు జోరందుకున్నాయి. ఇప్పటికి సుమారు 85 శాతం మేర నాట్లు పూర్తి అయ్యాయి. మిగిలిన విస్తీర్ణంలో కూడా నాట్లు పూర్తి కాగలవని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వరుణుడిపైనే భారం

మండలంలో ప్రధానంగా ఖరీఫ్ సీజన్లో వరి, చెరకు పంటలను సాగు చేస్తుంటారు. వీటిలో వరి సాధారణ విస్తీర్ణం 892 హెక్టార్లుగా ఈ ఏడాది అధికారులు నిర్ణయించారు. కశింకోట, వెదురుపర్తి, బయ్యవరం, తేగాడ, కొత్తపల్లి, పేరంటాలపాలెం, జోగారావుపేట, బుచ్చియ్యపేట, జమాదులపాలెం, ఉగ్గినపాలెం, పరవాడపాలెం, తాళ్లపాలెం, అచ్చెర్ల, జి.భీమవరం, సుందరయ్యపేట, కన్నూరుపాలెం, తీడ, చెరకాం, గొబ్బూరు, ఏఎస్ పేట, చింతలపాలెం, నరసింగబిల్లి, సోమవరం, నూతలగుంటపాలెం, ఏనుగుతుని, అడ్డాం, విసన్నపేట తదితర గ్రామాల్లో ఖరీఫ్ వరి ఎక్కువగా సాగు చేస్తారు. దీనికి వర్షం, శారదానది నీరు, సాగునీటి చెరువులు ప్రధాన ఆధారం. కొందరు రైతులు బోర్ల ఆధారంగా కూడా సాగు చేస్తారు. ఏదైనా సకాలంలో వర్షాలు కురిస్తేనే వరి పంట పండే పరిస్థితి. గత ఏడాది వాతావరణం అనుకూలించడంతో సాధారణ విస్తీర్ణాన్ని మించి వరి నాట్లు వేశారు. దాదాపు 200 హెక్టార్ల విస్తీర్ణంలో అదనంగా వరి నాట్లు వేశారు. అయితే ఈ ఏడాది సీజన్ ప్రారంభం నుంచి సరైన వర్షాలు కురవలేదు. దీంతో వరినాట్లలో మందగమనం తప్పలేదు.

వర్షాలతో పెరిగిన ఆశలు

ఈ ఏడాది రుతుపవనారంభంలో మండలంలో ఆశించిన మేరకు వర్షాలు పడలేదు. దీంతో 60 శాతం వరకు నాట్లు పడితే చాలని అధికారులు భావించారు. సాధారణ సాగు విస్తీర్ణంపై ఆశలు వదులుకున్నారు. ప్రత్యామ్నాయాలపై కూడా ఆలోచనలు ప్రారంభించారు. అయితే గత కొద్ది రోజులుగా అడపా దడపా వర్షాలు కురుస్తున్నాయి. ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు భారీగా శారదానదిలో చేరుతోంది. దీంతో నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న కశింకోట, వెదురుపర్తి, బయ్యవరం, పేరంటాలపాలెం, జోగారావుపేట తదితర ప్రాంతాల రైతుల్లో ఆశలు చిగురించాయి. సాగునీటి కాలువల ద్వారా ఆయకట్టు భూములకు నీరు చేరుతుండటంతో రైతులు ముమ్మరంగా నాట్లు వేస్తున్నారు. ఆయా గ్రామాలతోపాటు ఉగ్గినపాలెం, అచ్చెర్ల, పరిసర ప్రాంతాల్లో నాట్లు పూర్తి కావలసి ఉంది. మిగిలిన చోట్ల అక్కడక్కడ మినహా దాదాపు నాట్లు పూర్తి అయ్యాయి. మిగిలిన చోట్ల కూడా నాట్లు పూర్తయ్యేందుకు శారదానది నీరు, వర్షాలు ఉపకరిస్తాయని రైతులు చెప్పున్నారు.

> **వారం రోజుల్లో లక్ష్యం మేరకు వరి నాట్లు**
>
> మండలంలో ఖరీఫ్ వరి సాధారణ సాగు విస్తీర్ణం 892 హెక్టార్లు. వీటిలో ఇప్పటి వరకు 85 శాతం మేర 758 హెక్టార్లలో నాట్లు పూర్తి అయ్యాయి. ఇన్నాళ్లూ సరైన వర్షాల్లేక వరి నాట్లు పూర్తి కాని పరిస్థితి. గత కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. శారదానదిలో కూడా అదనంగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో రానున్న వారం రోజుల్లోగా సాధారణ విస్తీర్ణం మేరకు వరి నాట్లు పూర్తవుతాయని ఆశిస్తున్నాం.
>
> –ఎం.స్వప్న, మండల వ్యవసాయ అధికారి, కశింకోట

చిరు ధాన్యాలతో ఆరోగ్య సంరక్షణ



పౌష్టికాహార మాసోత్సవంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో ప్రభావతి

కశింకోట: చిరు ధాన్యాలు ఆరోగ్యాన్ని సంరక్షిస్తాయని, వీటిని ఆహారంలో భాగంగా చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో పి.ప్రభావతి సూచించారు. మండలంలోని జమాదులపాలెం గ్రామంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా చిరు ధాన్యాలు, పౌష్టికాహార పదార్థాల ప్రదర్శన నిర్వహించి, బాలింతలు, గర్భిణులు, పిల్లలకు అవగాహన కలిగించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చిరు ధాన్యాలను ఆహారంలో భాగంగా తీసుకుంటే పలు అనారోగ్య సమస్యల నుంచి బయట పడవచ్చన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహార కిట్లను వినియోగించుకుని రక్తహీనతను అధిగమించవచ్చన్నారు. ఆకు కూరలు, పండ్లు, కోడి గుడ్లు, పాలు తదితర వాటిని ఆహారంలో ఎక్కువగా వినియోగించుకోవాలన్నారు. సూపర్‌వైజర్ సీహెచ్ వంశీప్రియ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు 1000 డేస్ కేర్(గర్భ ధారణ నుంచి రెండేళ్ల వరకు బిడ్డ సంరక్షణ) పాటిస్తే పిల్లల భవిష్యత్తు ఆరోగ్యానికి బంగారు బాటలు వేసినవారవుతారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా బిడ్డ పుట్టిన ఆరు మాసాల వరకు తల్లి పాలు ఇవ్వడం, ఆ తర్వాత పాలతోపాటు అనుబంధ పోషకాహారాన్ని అందించి, బిడ్డ ఆరోగ్యకర ఎదుగుదలకు దోహదపడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కరక రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు గూడుపు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి కరక శేషు, పార్టీ నాయకుడు గూడుపు రాజు, మహిళా పోలీస్ సంతోషి, ఏఎన్ఎం చంద్రమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు గంగవేణి, సూర్యకుమారి, పార్వతి, రమణమ్మ, సుబ్బలక్ష్మి, పద్మ, నాగవరలక్ష్మి, రమణి తదితరులు పాల్గొన్నారు.

తిరుమల పాదయాత్ర భక్తులకు ఆతిథ్యం



తిరుమల పాదయాత్ర భక్తులతో మళ్ల బుల్లిబాబు, రమేష్, స్థానికులు

కశింకోట: తిరుమల, తిరుపతి దర్శనానికి పాదయాత్రగా వెళుతున్న భక్తులకు గురువారం కశింకోటలో ఘన స్వాగతం పలికారు. శ్రీకాకుళం జిల్లా పోలాకి మండలం అంపలాం గ్రామం నుంచి నల్లని శ్రీహరి, కె.ఆనందరావు తిరుమలకు పాదయాత్రగా బయలుదేరారు. పాదయాత్ర కశింకోట చేరడంతో పూలదండలు వేసి వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పంచాయతీ కార్యదర్శి ఎస్.రమేష్, సచివాలయ సిబ్బంది స్వాగతించారు. పంచాయతీ కార్యాలయం వద్ద ఆతిథ్యం అందించి వీడ్కోలు పలికారు.

కశింకోట పీఏసీఎస్ సభ్యులకు డివిడెండ్



పీఏసీఎస్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న సీఈవో నూకేశ్వరరావు

కశింకోట: కశింకోట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ సభ్యులకు ఈ ఏడాది తొలిసారిగా వాటా ధనంపై ఆరు శాతం డివిడెండ్ ఇవ్వాలని సంఘ సర్వ సభ్య సమావేశం నిర్ణయించింది. సంఘ చైర్‌పర్సన్ గొంతిన అప్పారావు అధ్యక్షతన గురువారం సంఘ ఆవరణలో మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సీఈవో ద్వారపురెడ్డి నూకేశ్వరరావు సంఘం ప్రగతిని వివరించారు. ఈ ఏడాది రూ.12.71 కోట్ల లాభాన్ని సంఘం ఆర్జించిందన్నారు. లాభాల నుంచి డివిడెండ్ ఇవ్వాలని పాలక వర్గం నిర్ణయించినట్లు వెల్లడించారు. గతంలో ఎన్నడూ డివిడెండ్ ఇవ్వలేదన్నారు. త్వరలో సంఘ సభ్యుల సౌకర్యార్థం విద్యుత్ బిల్లుల చెల్లింపు, మొబైల్ రీఛార్జిలు, ఆన్‌లైన్ ద్వారా కావలసిన ఉత్పత్తులు పొందేందుకు కామన్ సర్వీస్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 2022–23 సంవత్సరం బడ్జెట్, 2023–24 అంచనా బడ్జెట్‌ను చదివి వినిపించగా, దానికి సమావేశం ఆమోదం తెలిపింది. సంఘంలో ఏడాదికి రూ.13.35 కోట్ల టర్నోవర్ జరుగుతున్నట్లు వెల్లడించారు. సంఘ ప్రతినిధులు శిలపరశెట్టి రెడ్డి నాయుడు, గనిరెడ్డి నాగేషు, సభ్యులు పాల్గొన్నారు.


దళిత ప్రతినిధుల గర్జన పోస్టర్ ఆవిష్కరణ



అంబేడ్కర్ విగ్రహం ముందు పోస్టర్ ఆవిష్కరిస్తున్న దళిత నాయకులు

కశింకోట: స్థానిక పోలీస్ స్టేషన్ వద్దనున్న నవ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత ప్రతినిధుల గర్జన పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. జిల్లా దళిత నాయకులు మంత్రి పీటర్ వైజ్‌మన్, దొమ్మెసి సత్యారావు పోస్టర్ ఆవిష్కరణ అనంతరం మాట్లాడుతూ ఈ నెల 23న నర్సీపట్నంలో దళిత ప్రతినిధుల గర్జన భారీ స్థాయిలో జరగనుందన్నారు. ఈ సందర్భంగా అట్రాసిటీ చట్టంలోని 41ఏ నోటీసు రద్దు చేయాలని, రిజర్వేషన్లు సక్రమంగా అమలు చేయాలని, దళితులపై దాడులు అరికట్టాలని, ఎస్సీలకు కేటాయించిన నిధులు వారికే ఖర్చు చేయాలని తదితర డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు పాల్గొన్నారు.

గణనాథునికి ఘన పూజలు



తాళ్లపాలెం కూడలిలో శ్రీరాముని రూపంలో అలరిస్తున్న వినాయకుడు



బయ్యవరం సిమెంట్ పరిశ్రమ వద్ద నెమలి వాహనంపై వినాయకుడు



కశింకోట వద్ద సాయినగర్‌లో ఏడు అడుగుల భారీ గణనాథుడు



గణపతి మాలధారణలో భజనలు చేస్తున్న భక్తులు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం కూడలిలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన శ్రీరాముని రూపం వినాయకుడు ఆకట్టుకుంటున్నాడు. హనుమంతుడు ఆసనంగా మారగా, వినాయకుడు బాణం ఎక్కుపెడుతున్నట్లు విగ్రహాన్ని నెలకొల్పారు. భక్తులు, స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. బయ్యవరంలోని సిమెంట్ పరిశ్రమ వద్ద ఏర్పాటు చేసిన నెమలి వాహనంపై వినాయకుడు, కశింకోట వద్ద సాయినగర్ కాలనీలో ఏడడుగుల భారీ గణపతి విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా నిత్య పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు.

అనకాపల్లిటౌన్: పట్టణం గణనాథుని నామస్మరణతో మారుమోగుతోంది. స్థానిక లక్ష్మీ గణపతి ఆలయంతో పాటు, సాయినాథుని ఆలయం, పెదరామస్వామి ఆలయం, చినరామస్వామి ఆలయం వీధుల్లో యువత ఏర్పాటు చేసిన మండపాల్లో గణనాథునికి ప్రత్యేక పూజలు, హోమాలు, భజనలతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. కొన్ని చోట్ల గణపతి మాలధారణతో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, ప్రసాదాలు స్వీకరించారు.

నియోజకవర్గ అభివృద్ధే మంత్రి అమర్‌నాథ్ ధ్యేయం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జానకీరామరాజు

అనకాపల్లిటౌన్: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్షాలు ఎన్ని అడ్డంకులు సృష్టించిన అభివృద్ధి కార్యక్రమాలతోనే మంత్రి సమాధానం చెప్తున్నారని తెలిపారు. పట్టణంలో సుమారు రూ.20 కోట్లతో రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. పట్టణంలో శారదానది, గవరపాలెం హిందూ శ్మశాన వాటికలను రూ.2 కోట్లతో అభివృద్ధి చేపట్టేందుకు మంత్రి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా జిల్లా ఆస్పత్రిలో మరో 50 పడకలను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ వైద్యాలయంలో లారస్ ఫార్మా ఆర్థిక సహకారంతో అగ్నిప్రమాద క్షతగాత్రుల కోసం ప్రత్యేక వార్డును ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. పరిశ్రమల సీఎస్ఆర్ నిధులతో కల్యాణ మండపాలు, టీటీడీ మాజీ చైర్మన్ సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్ కృషితో రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ విడుదల చేసిన రూ.10 కోట్లతో ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబిక ఆలయ ఆధునికీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. మండలంలోని కొత్తూరులో టీటీడీ ఆధ్వర్యంలో కల్యాణ మండపం, ఉద్యానవనం, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కోడూరు గ్రామంలో ఎంఎస్ఎంఈ ఆటోనగర్ ఏర్పాటు చేసి, యువతకి ఉపాధి కల్పించేందుకు మంత్రి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఇన్ని అభివృద్ధి పనులు చేపడుతుంటే, కళ్లుండీ గుడ్డివారిలా విపక్ష నేతలు మాట్లాడటం ఆక్షేపణీయమన్నారు.

ఆలయ పాలక వర్గాలు ఉత్తర్వుల విడుదల

పట్టణంలో దేవునిగుమ్మం వేంకటేశ్వరస్వామి, సుంకరమెట్ట సత్యనారాయణస్వామి, సిద్ధిలింగేశ్వరస్వామి, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల పాలకవర్గ నియామక ఉత్తర్వులను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నూకాంబిక దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, భోగలింగేశ్వరస్వామి చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం కార్యదర్శి జాజుల రమేష్, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, సకలా గోవిందరావు, నుదురుపాటి తాతాజీ, ఎన్టీఆర్ వైద్యాలయ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ గుండా రమేష్ గుప్త, పార్టీ నాయకులు ఏరువాకల నారాయణరావు, కారుకుండి కన్నబాబు, బేతి ఈశ్వరరావు, నాగులాపల్లి వీర్రాజు, ముమ్మిన పైడిరాజు, సుంకర వెంకటేశ్వరరావు, సీహెచ్ వాసు, సూరిశెట్టి సన్యాసిరావు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



పోటీల్లో ఎంపికైన క్రీడాకారులతో ఎంపీపీ సూరిబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు

అనకాపల్లి రూరల్: క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం లభిస్తుందని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. గురువారం మండలంలోని కూండ్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి అండర్-14, 17 బాల బాలికల ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. వివిధ పాఠశాలల నుంచి పోటీల్లో పాల్గొనడానికి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. అనంతరం వివిధ క్రీడల్లో ప్రతిభ చూపి, నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సేనాపతి పెంటారావు, నక్కరాజు ప్రభాకర్, వివిధ పాఠశాలకు చెందిన పీఈటీలు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువగా మొబైల్ వైద్యం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న హెల్పేజ్ ఇండియా ప్రతినిధి డాక్టర్ కేవీ రావు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం సహకారంతో అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హెల్పేజ్ ఇండియా సోషల్ ప్రొటెక్షన్ ఆఫీసర్ డాక్టర్ కేవీ రావు పిలుపునిచ్చారు. వాడచీపురుపల్లి, గొల్లపేట గ్రామాల ప్రజలకు మొబైల్ వ్యాన్ ద్వారా గురువారం వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా డాక్టర్ రావు మాట్లాడుతూ ఎన్టీపీసీ కార్పొరేట్ సమాజిక బాధ్యత నిధులతో ప్రతి వారం 29 గ్రామాలకు చెందిన మధ్య తరగతి, పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. మధుమేహం, బీపీ, కీళ్ల నొప్పులు, గ్యాస్ట్రిక్, థైరాయిడ్, మూర్ఛ, చర్మ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. నడవలేని స్థితిలో ఉన్న రోగులకు వారి ఇంటి వద్దే వైద్య పరీక్షలు జరిపి మందులిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్పేజ్ ఇండియా ప్రతినిధి కేవీ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి



మృతుడు భీమస్వామి (ఫైల్)

సబ్బవరం : రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన ఒక వ్యక్తి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. మండలంలోని ఇరువాడ గ్రామానికి చెందిన జెట్టి భీమస్వామి (43) వంట కుక్‌గా పని చేస్తూ గ్రామంలో నివాసం ఉంటున్నాడు. సొంత పనులపై మంగళవారం సబ్బవరం వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై గ్రామానికి వస్తుండగా మార్గ మధ్యలో హెచ్‌పీసీఎల్ పైప్‌లైన్ వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో భీమస్వామికి తల వెనుక బలమైన గాయాలు కావడంతో స్థానికులు సబ్బవరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. అయితే చికిత్స పొందుతూ అతను గురువారం కేజీహెచ్‌లో మృతి చెందాడు. మృతదేహన్ని కుటుంబ సభ్యులు గ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి భార్య సూరమ్మతో పాటు లలిత, గాయిత్రి అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రైతులకు పాస్ బుక్‌ల పంపిణీ



రైతుకు పాస్ బుక్ అందిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లిటౌన్:మండలంలోని గోపాలపురం గ్రామ సచివాలయంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకంలో సర్వే పూర్తయిన 380 మంది రైతులకు పాస్ బుక్‌లను గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా భూ సమస్యలు తగ్గి, రైతులకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జెర్రిపోతుల లక్ష్మి, వార్డు మెంబర్లు, రైతులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జి.భీమవరంలో దొంగతనం

కశింకోట: మండలంలోని జి.భీమవరం గ్రామంలో జరిగిన దొంగతనంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. ఈ నెల 19న హనుమంతు గణేష్, తన భార్యతో కలిసి పొలానికి వెళ్లారు. అతని కుమారుడు మణికుమార్, కోడలితో కలిసి అత్తవారింటికి వెళ్లారు. పొలం పని ముగించుకుని తిరుగుముఖం పట్టిన గణేష్‌కు ఇంటి తలుపులు తెరచి ఉండటం కనిపించింది. దీంతో ఇంట్లోకి వెళ్లి చూడగా ఒకటిన్నర తులం బంగారు గొలుసు, అరతులం చెవి దిద్దులు చోరీకి గురైనట్లు గుర్తించారు. కుమారుడు మణికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట:స్థానికవారపు సంతలో కూరగాయల ధరలు గురువారం దాదాపు స్థిరంగా ఉన్నాయి. దొండకాయల ధర మాత్రం రెట్టింపు అయింది. గత వారం కిలో రూ.20 ఉండగా, ఈ వారం రూ.40కి చేరుకుంది. టమాటా, బంగాళా దుంప రూ.20, ఉల్లిపాయ రూ.30, వంకాయ, క్యారెట్, బీట్రూట్, బెండకాయ రూ.40, చేమదుంప, బీరకాయ రూ.60, క్యాప్సికం, గోరు చిక్కుడు రూ.80కి విక్రయాలు సాగాయి.